క్లుప్తంగా...

నేడు 'జయహో పోలీస్'

గన్‌ఫౌండ్రీ: శృతిలయ ఆర్ట్స్ అకాడమి, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న రవీంద్రభారతిలో జయహో పోలీస్ పేరిట సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని ఆమని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్ అలీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, శాసన మండలి సభ్యులు వేణుగోపాల చారి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు ఉన్నతాధికారులకు ప్రైడ్ ఆఫ్ ఇండియా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు అంకితం ఇస్తూ సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



సమావేశంలో ఫిరోజ్‌ఖాన్, మధుసుధన్‌గుప్తా, నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం, ప్రగతి కొనసాగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, మాజీ ప్రధాన కార్యదర్శి మధుసుదన్ గుప్తా పేర్కొన్నారు. ఆదివారం ఉస్మాన్‌షాహి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్‌ఖాన్, మధుసుదన్ గుప్తా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చినా కాంగ్రెస్ వైపే అన్నివర్గాల ప్రజలు ఉన్నారన్నారు. నిర్మల్‌కుమార్, యాదవ్, అనిల్‌సింగ్, సంజయ్‌కుమార్, శ్యామ్‌సింగ్, గోకరణ్ సింగ్, శ్రీధర్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన కళలకు సముచిత ప్రాధాన్యం



సినీనటుడు మాణిక్ ప్రభును సన్మానిస్తున్న దైవాజ్ఞశర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సనాతన సాంప్రదాయ కళలకు పెద్దపీట వేస్తుందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్‌గుప్తా అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత్‌ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో జయహో భారత్ పేరిట తెలుగు వాగ్యేయ వైభవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..77వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విలక్షణమైన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సినీ నటుడు మాణిక్‌ప్రభు, పలువురు నృత్య సంగీత గురువులను ఘనంగా సన్మానించారు. సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సినీనటుడు జేఎల్ శ్రీనివాస్, భారత్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకులు కేవీ రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లలిత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్‌కు సత్కారం



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న పప్పు మాత్రే

అబిడ్స్: నగర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీగా నియమితులైన శ్రవణ్‌కుమార్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు పప్పుమాత్రే ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం చేశారు. ఆదివారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పుమాత్రే మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలలా బీఆర్ఎస్‌దే విజయమన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతితోనే బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు.

బీజేపీతోనే దేశం సుభిక్షం



ఆచార్య పవన్ తిరుపతిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సుల్తాన్‌బజార్: బీజేపీతోనే దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ ముంబై రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆచార్య పవన్ తిరుపతి అన్నారు. ఈ మేరకు నగరానికి విచ్చేసిన ఆయనకు బీజేపీ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌రావు, సూర్యశుక్లా, వినిత్‌యాదవ్, రాజారాం, నరేష్, సోని, కిరణ్‌యాదవ్, వినయ్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

సండే సందడి

- వీకెండ్‌తో సందడిగా మారిన పర్యాటక ప్రాంతాలు
- జోరుగా కొనసాగిన చిరు వ్యాపారాలు



చార్మినార్-గుల్జార్‌హౌజ్ రోడ్డులో సందర్శకుల సందడి

చార్మినార్: ఆదివారం పాతబస్తీలో సందర్శకుల సందడి నెలకొంది. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద యధావిధిగా ట్రాఫిక్ జాం తప్ప లేదు. చార్మినార్ కట్టడం వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగి సరదాగా కాలక్షేపం చేశారు. గంటల కొద్ది స్నేహితులతో గడిపారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతబస్తీలోని పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. తమ కుటుంబ సభ్యులతో కలిసి పాతబస్తీలోని చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి.

కోట కిటకిట..

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులకు కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడం కోటకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం 7 గంటల నుంచే గోల్కొండ కోట టికెట్ కౌంటర్ వద్ద పర్యాటకులు బారులు తీరారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలోని క్లాపింగ్ పోర్టికో వద్ద చాలా సేపు సందడి చేశారు. క్లాపింగ్ పోర్టికో పై భాగంలో ఉన్న యంత్రం కింద ఉన్న వారు చప్పట్లు కోడితే కోట పై భాగంలో దర్బార్ హాల్ వద్ద ఆ చప్పట్లు వినపడతాయని గోల్కొండ కోట హిస్టరీ గైడ్స్ పర్యాటకులకు వివరించారు. వచ్చిన పర్యాటకులతో గోల్కొండ వద్ద గల చౌరాస్తాలోని రెస్టారెంట్లు, గిఫ్ట్‌షాప్ సందడిగా మారాయి.



గోల్కొండ కోటలో పర్యాటకులు

ఒరిగిన నాలుగంతస్తుల భవనం

బహదూర్‌పురా: బహదూర్‌పురా హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం పూర్తిగా ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉండడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. శనివారం రాత్రి 9 గంటలకు ఒక్కసారిగా భవనం ఒరిగిపోవడంతో ఇటుకలు, పెచ్చు సామగ్రి కింద పడ్డాయి. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చుట్టు పక్కల వారిని అప్రమత్తం చేసి ఇళ్లు ఖాళీ చేయించారు. కిషన్‌బాగ్ కార్పొరేటర్ హుస్సేనీ పాషా ఘటనా స్థలాన్ని సందర్శించి చుట్టు పక్కల రాకపోకలను నిలిపి వేసి చర్యలు చేపట్టారు. హౌసింగ్ బోర్డు కాలనీలో రెండంతస్తులకు అనుమతి తీసుకొని నాలుగైదు అంతస్తుల వరకు యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ ఫలక్‌నుమా ఉప కమిషనర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఒరిగిపోయిన భవనాన్ని కూల్చివేయడానికి ప్రత్యేకంగా బెంగళూర్ నుంచి భారీ జేసీబీ క్రేన్‌ను తెప్పిస్తున్నామన్నారు. ఒంగిపోయిన భవనానికి ఎదురుగా ఉన్న మరో భవనంలో 22 కుటుంబాలను, చుట్టుపక్కల 10 కుటుంబాలను పూర్తిగా ఖాళీ చేయించామన్నారు. ప్రత్యేకంగా రప్పిస్తున్న భారీ వాహనం కోసం అడ్డంగా ఉన్న చెట్లను జీహెచ్ఎంసీ అధికారులు తొలగిస్తున్నారు.



భవనం పైనుంచి కిందపడిన ఇటుకలు

అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



మహిళ నుంచి వినతిపత్రాన్ని తీసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం కార్వాన్, లంగర్‌హౌజ్, గోల్కొండ తదితర ప్రాంతాల నుంచి పలువురు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పలువురు తాము చేసుకున్న దరఖాస్తులకు ఇంకా మంజూరీ లభించలేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. అయితే సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఓపిక వహించాలని దరఖాస్తు పరిశీలనకు సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వచ్చి పరిశీలిస్తారన్నారు. దరఖాస్తులో అన్ని విషయాలు సరిగ్గా ఉంటే వాటికి వెంటనే మంజూరు లభిస్తుందని అన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం గోల్కొండ సర్కారీ ఆశీర్‌ఖానా వద్ద షియా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి షియా ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ఆధ్వర్యంలో పోలీసులు గోల్కొండ కోట చౌరస్తా, రామ్‌దేవ్‌గూడ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో మైత్రి కమిటీ సభ్యులు

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల అందజేత



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న మాణిక్‌రావు ఠాక్రే, మెట్టు సాయికుమార్ తదితరులు

అబిడ్స్: విద్యార్థులకు తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కిట్‌ను కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, మాజీ ఎంపీలు మధుయాష్కీ, అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు, యువతకు ఉచితంగా స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో షియా ముస్లింల జాలా ప్రదర్శన

చార్మినార్: 68 రోజుల పాటు కొనసాగే మోహర్రం సంతాప దినాలలో భాగంగా షియా ముస్లింలు ఆదివారం అశ్రునయనాల నడుమ జూలా ప్రదర్శన నిర్వహించారు. కర్బలా యుద్ధ మైదానంలో 72 మందితో పాటు ఇమాం హుస్సేన్ ఆరు నెలల చిన్నారి వీర మరణం పొందడాన్ని నిరసిస్తూ షియా ముస్లింలు ఆదివారం పాతబస్తీ వీధుల్లో జూలాతో భారీ ప్రదర్శన నిర్వహించారు. దారిపొడవునా బ్లేడ్లు, కత్తులను ఎదపై బాదుకుంటూ మాతం నిర్వహించారు. ఆనాడు జరిగిన సంఘటనను నిరసిస్తూ రక్తాన్ని చిందించారు. నూర్‌ఖాన్‌బజార్‌లోని బాల్‌షట్టికేత్ నుంచి బయలు దేరిన జూలా ప్రదర్శన కోట్ల అలీజా ద్వారా దారుషిఫా వరకు కొనసాగింది. షియా ముస్లింల ప్రదర్శన సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని అవసరమైన మేరకు ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఈ ప్రదర్శనలో మౌలానా సయ్యద్ వాహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ ఖిబ్లా అక్బారీ,మీర్ హైదర్ అలీ జాఫ్రీ పాల్గొన్నారు.



పాతబస్తీ వీధుల్లో షియా ముస్లింల జూలా నిరసన ప్రదర్శన

గృహిణి అదృశ్యం

గౌలిపురా: గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టకు చెందిన మహ్మద్ జుబేర్ 2019 జనవరిలో మోసినా పర్వీన్(40)ను రెండో వివాహం చేసుకున్నాడు. ఈనెల 18న సాయంత్రం స్థానికంగా దర్గాకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన పర్వీన్ తిరిగి రాలేదు. ఆమె ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ ఉండడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



మోసినా పర్వీన్

భక్తిశ్రద్ధలతో అలంల ఊరేగింపు



మోతీదర్వాజ వద్ద అలంల ఊరేగింపు

గోల్కొండ: మొహర్రం నెల తర్వాత ఇస్లామిక్ కేలండర్ ప్రకారం సఫర్ నెలలో వివిధ ఆశిర్‌ఖానాలలో అలంలు కొలువుదీరుతాయి. ఆదివారం గోల్కొండ, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో అలంలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో తెల్లవారుజాము 5 గంటల నుంచే వివిధ రకాల అలంకరణలతో అలంలను ఊరేగించారు. టోలిచౌకి చౌరస్తా వద్ద అలంల ఊరేగింపులో భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అదే విధంగా గోల్కొండ బడాబజర్ నుంచి అలంల ఊరేగింపు ప్రారంభమైంది. బడాబజర్ నుంచి చోడా బజార్, మోతీ దర్వాజ వద్ద ఈ ఊరేగింపు ముగిసింది. ముస్లింలు అలంలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అలంలకు దట్టీలు సమర్పించి తమతమ మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక పూజలు

గోల్కొండ: టప్పా మైసమ్మ ఆలయంలో దేవాతమూర్తుల విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో భాగంగా ఆదివారం పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు మండప దేవతా పూజా, మూలమంత్ర హోమం, చండీహోమం, విశేష ద్రవ్యములతో మహాస్నపనం, హారతీ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 5 గంటలకు ఆవాహిత దేవతహోమం, ఛయాభివసం, ద్వాదశివాసములు తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్ ఈ పూజా కార్యక్రమాలకు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నాంపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అరించాయి. నగరంలోని పలు నృత్య పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇక్కడ సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ రామదాసు తేజావత్ హాజరయ్యారు. ఈ నృత్య ప్రదర్శనలో బాలాపూర్‌కు చెందిన కుమారి సాయి రాఘవి, కుమారి మధులత ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులకు ఆకట్టుకుంది.

బెల్టు షాప్‌పై పోలీసుల దాడి

చాంద్రాయణగుట్ట: అక్రమంగా కొనసాగుతున్న బెల్టు షాప్‌పై ఫలక్‌నుమా పోలీసులు ఆదివారం దాడి నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం..జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్‌లో బుజ్జి(45) అనే మహిళ అక్రమంగా బెల్టు షాప్ నిర్వహిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. ఆమెను అదుపులోకి తీసుకొని 43 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

చరిత్రకారులకు మరణం లేదు

గన్‌ఫౌండ్రీ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ లాంటి చరిత్రకారులకు మరణం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో సర్దార్ పాపన్నగౌడ్ 373వ జయంతిని పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్రను ప్రజలకు తెలియజేసేది కవులేనన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ చరిత్ర భవిష్యత్ తరాలకు ఆదర్శం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న ట్రస్టు చైర్మన్ పంజాల జైహింద్ గౌడ్, తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బడేసాబ్, తెలంగాణ గౌడ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు బత్తిని రాజుగౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు విక్రమ్‌గౌడ్, కుల్కచర్ల శ్రీను, జాజుల లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గృహలక్ష్మి దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న నరహరిచారి, కిశోర్‌కుమార్

జియాగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జియాగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలోని బీఆర్ఎస్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో బీసీ మైనార్టీ బంధు, గృహలక్ష్మి సంక్షేమ పథకాలపై సమావేశం నిర్వహించారు. అనంతరం గృహలక్ష్మి దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జియాగూడలో నిరుపేద కుటుంబాలు అధికంగా ఉన్నాయని వారికి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ఎంతో బాసటగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జడల మోహన్, నర్మద, సంగీత, ఉమేష్, కేశవ్, వెంకటేష్, నర్సింగ్ రావు, సురేఖ, శాంత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

అబిడ్స్: కట్టెలమండి బస్తీలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు 3వ రోజు ఆదివారం జోరుగా నిర్వహించారు. హోమం, ఇతర పూజలు చేపట్టారు. రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్, ఆయన సతీమణి, షిఫాలీ హోమం చేసి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో దాసరి రాజ్‌కుమార్ జగపతి శేఖర్, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హోమం చేస్తున్న రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ దంపతులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



యాత్రకు స్వాగతం పలికిన ఠాకూర్ జీవన్ సింగ్, సంతోష్ నాయుడు

అబిడ్స్: ఆధ్యాత్మికతతోనే మనిషి మానసిక ప్రశాంతంగా జీవిస్తారని సంఘ సేవకుడు ఠాకూర్ జీవన్ సింగ్, సంతోష్‌నాయుడు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆధ్యాత్మిక భావాలవైపు మొగ్గుచూపితే ఎంతో ప్రశాంతకరంగా జీవనం గడుపుతారన్నారు. ఆదివారం బేగంబజార్ ఎంజే బ్రిడ్జి వద్ద ఉత్తర భారతీయుల కావడి యాత్రకు ఠాకూర్ జీవన్‌సింగ్, సంతోష్‌నాయుడు ఆధ్వర్యంలో స్వాగత వేదిక ఏర్పాటు చేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రావణమాసంలో కావడి యాత్రలు నిర్వహించడం ద్వారా ఎంతో ముక్తి లభిస్తుందన్నారు.

25 నుంచి స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ మరో అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదిక కానుంది. అఖిల భారత చెస్ ఫెడరేషన్, తెలంగాణ చెస్ సహకార సంఘాల సౌజన్యంతో ఈనెల 25వ తేదీ నుంచి ఇండోర్ స్టేడియంలో స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ జరుగనుంది. ఈ మేరకు ఆదివారం ఎల్బీస్టేడియంలో అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ వాల్‌పోస్టర్‌ను శాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు సముచిత ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి చెస్ క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతిగా రూ.10 నగదు, 300 మందికి ప్రోత్సాహ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 73863 77787 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్

కురుమలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ

అఫ్జల్‌గంజ్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కురుమ కులాస్తులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ డిమాండ్ చేశారు. ఆదివారం ముస్లింజంగ్‌పూల్ బ్రిడ్జి వద్ద ఉన్న రాష్ట్ర కురుమ సంఘం భవనంలో వివిధ జిల్లాల సంఘాల పదాధికారుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగి ఉన్నా చట్ట సభల్లో తమకు స్థానం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కురుమల సత్తాను చాటేందుకు సెప్టెంబర్‌లో భువనగిరిలో లక్ష మందితో కురుమ సింహ గర్జన నిర్వహిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో కురుమ కులస్తులు ఎక్కువ మంది ఉన్న చోట ఎమ్మెల్యే టికెట్ ఇస్తే సమష్టిగా కృషి గెలిపించుకుంటామన్నారు. కురుమ సంఘం రాష్ట్ర నాయకులు మల్లేషం, నారాయణ, మల్లేషం, నర్సింహ, కన్నా, రాజు, నరేష్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: దేశంలో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా జంగమ్మెట్‌లో ఆదివారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి కిరణ్, ఉదయ్, దీప్ పాల్గొన్నారు.

చార్మినార్ వద్ద..

చార్మినార్: రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో ఆదివారం చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం వద్ద స్వర్గీయ రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ అనంతరం రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన నాయకులు పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.నిరంజన్,కన్నయ్యలాల్, కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ పాల్గొన్నారు.



పండ్లు పంచి పెడుతున్న నిరంజన్